

మెప్మాకు గిన్నిస్ రికార్డులో చోటు



గిన్నిస్ బుక్ రికార్డులను మెప్మా పీడీకి, సిబ్బందికి అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన 672 రకాల ఉత్పత్తులలో 38 వాటికి బ్రాండింగ్ ఆమోదం పొందారు. వీటిని ప్రీ బుకింగ్ చేసుకున్న 5,100 మందికి ప్రపంచ మహిళా దినోత్సవం రోజున ఏక కాలంలో డెలివరీ చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లక్షపైగా ఆర్డర్స్ పొంది డెలివరీ చేయడంతో 3 ప్రపంచ రికార్డులను మెప్మా సొంతం చేసుకుంది. దీంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు పొందింది. ఈమేరకు ప్రపంచ రికార్డులను బుధవారం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, వరల్డ్ రికార్డ్ యూనియన్ వారు కడపకు చేరుకుని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతుల మీదుగా మెప్మా పీడీ కిరణ్ కుమార్, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లాకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. ఈ అవార్డులను సాధించి నందుకు మెప్మా అధికారులను, సిబ్బందిని అభినందించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు 11 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పలు యూనిట్ల ప్రాతిపదికన 2025-26 సంవత్సరానికి ఆర్థిక చేయూత రుణాలు అందించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం ఈనెల 11వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. ఇందులో మెడికల్ షాపు, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రిక్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటో, పాసింజర్ కార్ (4 వీలర్), గూడ్స్ ట్రక్ తదితర యూనిట్ల ద్వారా ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జీఓ నెంబర్ 5ను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే జిల్లాకు సంబంధించిన టార్గెట్లు రావాల్సి ఉంది.

స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ప్రక్షాళనకు చర్యలు..!

కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రక్షాళన చేసేందుకు ఎస్పీ అశోక్‌కుమార్ చర్యలు చేపట్టారు. స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుళ్లుగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిపై బదిలీవేటు వేయనున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నుంచి ఇప్పటి వరకు కొనసాగుతున్న వారితో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారికి స్థానచలనం కల్పించే అవకాశం కనిపిస్తోంది. కొంతమంది స్పెషల్ బ్రాంచ్‌లో చాలా ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇలాంటి వారు దాదాపు 20 మందిని బదిలీ చేయనున్నట్లు తెలుస్తుంది. నేడో ,రేపో బదిలీల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది.

ఐటీపై ఫోకస్

- కడపలో ఐటీ పార్క్ కోసం స్థలం అన్వేషణ
- రిమ్స్ వద్ద పది ఎకరాలు గుర్తింపు
- వైఎస్ హయాంలో ఐటీ పార్క్ కోసం స్థలం కేటాయింపు
- దానిని షిర్డీసాయికి కట్టబెట్టిన జగన్



రిమ్స్ సమీపంలో రింగ్‌రోడ్డు వద్ద ఐటీ పార్క్ కోసం పరిశీలించిన భూములు ఇవే

(కడప-ఆంధ్రజ్యోతి): రాజకీయంగా అందలమెక్కించిన సొంత జిల్లాకు తన వంతు ఏదైనా చేయాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భావించారు. అందుకు తగ్గట్లుగానే కడప రిమ్స్ వద్ద ఐటీ పార్క్ కోసం స్థలం కేటాయించారు. ఆయన మరణానంతరం కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా ఆ స్థలం జోలికి వెళ్లలేదు. వైఎస్ కొడుకుగా రాజకీయ వారసత్వం పుచ్చుకున్న జగన్ సీఎం అయ్యాక తండ్రి ఆశయానికి తూట్లు పొడుస్తూ ఐటీపార్క్ స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టి నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లారు. అయితే ఇప్పుడు సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. సంక్షేమం, అభివృద్ధి జోడిగా ముందుకెళుతోంది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం మంత్రి నారా లోకేశ్ వివిధ కంపెనీలతో మంతనాలు జరుపుతున్నారు. సీఎం చంద్రబాబు దావోస్‌లో కొన్నింటికి ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో కడపలో ఐటీ పార్కుపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురి పెట్టారు. ఐటీ సెజ్‌కు అవసరమైన భూములు ఎక్కడెక్కడున్నాయో గుర్తించే పనిలో పడ్డారు.

ఐటీ పరిశ్రమ తీసుకువస్తాం

సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి కడపకు ఐటీ పరిశ్రమ తీసుకు వస్తాం. ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయి. కడప శివారులో ఉన్న కొప్పర్తి అభివృద్ధితో పాటు మరిన్ని పరిశ్రమలు వస్తాయి. ఇక ఐటీ పరిశ్రమ వస్తే జిల్లా వాసులు ఇక్కడే ఉద్యోగాలు చేసుకుంటారు. జగన్ హయాంలో జిల్లాను పట్టించుకోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కడప జిల్లాను అన్నివిధాలుగా ముందుకు తీసుకెళతాం.

- ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు

నాడు 52.70 ఎకరాలు కేటాయింపు

ఇప్పుడంతా ఐటీ భూం నడుస్తోంది. జిల్లా యువత బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, ముంబై, పూణెలో ఐటీ సెక్టారులో పనిచేస్తున్నారు. కడపలో కూడా ఐటీ ఏర్పాటు చేయాలని అప్పట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భావించారు. ఈ మేరకు 2006-07లో రిమ్స్ వద్ద సీపీ బ్రౌన్ ఇంటర్నేషనల్ టెక్నాలజీ పేరిట 52.70 ఎకరాలతో సెజ్ ఏర్పాటు చేశారు. దీన్ని ఏపీఐఐసీకి కేటాయించారు. ఐటీ సెజ్‌కు కేటాయించిన స్థలంలో 31 సెంట్లు ఎస్పీడీసీఎల్‌కు అప్పట్లోనే అప్పగించారు. సుమారు 52 ఎకరాల పైచిలుకు ల్యాండ్ అలాగే ఉన్నది. రాజశేఖర్‌రెడ్డి అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగింది. 2014-19లో టీడీపీ ప్రభుత్వం ఉంది. అయితే జగన్ సీఎం అయిన తరువాత ఐటీ పార్క్ కోసం కేటాయించిన భూమిలో 49.80 ఎకరాలను షిర్డీసాయి ఎలక్ట్రానిక్స్‌కు కట్టబెట్టారు. ఇప్పుడు అక్కడ 2.10 ఎకరాలు మాత్రమే ఉంది.

స్థల పరిశీలన


కడప రాయలసీమకు కూడలి మాత్రమే కాదు.. అటు కర్ణాటక, ఇటు తమిళనాడుకు కూడా కూతవేటు దూరంలో ఉంది. జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్టు, రైలుమార్గాలు ఉన్నాయి. ఇక్కడ పరిశ్రమలకు కావాల్సిన అన్ని వనరులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ పార్క్ కోసం స్థలం కేటాయిస్తే ఐటీ కంపెనీలు వచ్చేందుకు వీలు ఉంటుందని భావించారు. స్థలంకోసం అన్వేషించారు. కడపలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఐటీ కోసం స్థలం కేటాయిస్తే పరిశ్రమలు తీసుకురావచ్చని భావిస్తున్నారు. ఇందులో భాగంగా రిమ్స్ సమీపంలోని రామక్రిష్ణమఠం వద్ద ఉన్న పది ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్.శ్రీనివాసరెడ్డి ఇటీవల పరిశీలించారు. రిమ్స్ సమీపంలోని హైదరాబాదు పబ్లిక్ స్కూలు సమీపంలో పుట్లంపల్లె సర్వే నెం.242, 243లో ఈ పది ఎకరాల భూమి ఉంది. దీనిపై ఎలాంటి వివాదాలు లేవు. ఇది ఐటీ పార్క్‌కు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు.

రిమ్స్ ప్రాంతం ఇప్పుడు కడప నగరంలో ముఖ్యమైనది మారింది. రిమ్స్‌తో పాటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూలు, రామక్రిష్ణమఠం, హైదరాబాదు పబ్లిక్ స్కూలు, కేంద్రీ విద్యాలయం, సింగపూర్ టౌన్‌షిప్, రింగ్‌రోడ్డు.. ఉండటంతో ఈ ప్రాంతానికి ప్రాధాన్యం పెరిగింది. దీనికితోడు పక్కనే పాలకొండలు కూడా ఉండడంతో ఇక్కడ ఐటీ సెజ్ ఏర్పాటు చేస్తే ఇది వైజాగ్‌ను తలపించే విధంగా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆ మేరకు తాము పరిశీలించిన స్థలాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

రామయ్యకు బ్రహ్మోత్సవ శోభ



భక్తులను ఆకట్టుకుంటున్న విద్యుత్ కటౌట్



విద్యుద్దీపాలతో వెలిగిపోతున్న కోదండరామాలయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామాలయం బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంటోంది. ఆలయ పరిసరాలు, ఒంటిమిట్ట పురవీధులు, కల్యాణవేదిక ప్రాంతాల్లో వివిధ రకాల విద్యుద్దీపాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామ పురవీధుల్లో శ్రీరామనామస్మరణ మారుమోగుతోంది. ఈ ఏడాది టీటీడీ వారు కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లను చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడలిలో విద్యుత్ కటౌట్‌లను అమర్చారు. అలాగే ఆలయ మాడవీధుల్లో భక్తులకు ఎండ తాకిడి తగలకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 5 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు.

మేనిఫెస్టోలో ఉన్న హామీలు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మెరుగైన పించన్ విధానం అమలు చేయాలని కోరారు. బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్‌ఎండీ ఇలియాస్ బాషా అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పింఛనర్లు చాలాకాలంగా కోరుతున్నప్పటికి ప్రభుత్వం స్పందించ లేదన్నారు. వాటి సాధన కోసం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు నిరసనకు దిగామన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పింఛనర్లకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు రూ.30 వేల కోట్లు ఉండగా ఇటీవల రెండు విడుతలుగా రూ.7,300 కోట్లు చెల్లించారని అన్నారు. ఇంకా 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలతో కలిపి దాదాపు రూ.33 వేలకోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే ఈ బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే 2024 జనవరి నుంచి ఇప్పటివరకు మూడు విడతల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే వాటి మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ, ఏఐఎస్‌టీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి, పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో నిర్లిప్త ధోరణి తగదన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు లక్ష్మీరాజా, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కె.సురేశ్‌బాబు, కె.బాలగంగిరెడ్డి జిల్లా సెక్రటరీ జనరల్ అబ్దుల్లా, వెంకటసుబ్బారెడ్డి, రామచంద్రబాబు, మాదన విజయకుమార్, శ్యామలాదేవి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం 7

అంతా...గందరగోళం
- జీవనోపాధికి ఇచ్చిన పాల్ట్రీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు
- అధికారుల వద్ద రెండు రకాల జాబితాలు 7

పార్టీని బలోపేతం చేస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి
- అట్టహాసంగా ప్రమాణస్వీకారం
- హాజరైన మంత్రి సత్యకుమార్



బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తదితరులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ నేతలందరినీ కలుపుకుని సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం కడపలోని హరిత హోటల్‌లో అట్టహాసంగా జరిగింది. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలన దోచుకో.. దాచుకో అనే పంథాలో సాగడంతో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. జిల్లాలోని గండికోట ముంపు వాసులకు పరిహారం ఇస్తామంటూ వారి నోట్లో మట్టి కొట్టారన్నారు. అన్నమయ్య ప్రాజెక్ట్ తెగిపోయేలా చేసిందీ వైసీపీ నాయకులే అన్నారు. సర్వారాయసాగర్ ప్రాజెక్ట్ నుంచి రైతుల భూములకు సాగునీరు ఇవ్వకుండా భారతి సిమెంట్ ఫ్యాక్టరీకి, జగన్‌రెడ్డి మేనమామ చేపల చెరువులకు నీటిని సాగనంపిన చరిత్ర వైసీపీదే అన్నారు. కాశినాయన మఠంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలన్నీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని త్వరలో అక్కడ అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు హయాంలో అటు దేశం, ఇటు రాష్ట్రం వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకోనున్నాయన్నారు.

అనంతరం ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమి పార్టీల కలయికలో తిరిగి విజయబావుటా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ద్వారా ప్రజలకు దాదాపు 142 పథకాలు ఉన్నాయని వాటి ద్వారా సబ్సిడీ అందిపుచ్చుకుని ఆర్థికంగా బలపడాలని కోరారు. జగన్‌రెడ్డి లాంటి అవినీతి పరుడిని పాతాళానికి తొక్కాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన జంగిటి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అందరి సహకారంతో రానున్న ఎన్నికల నాటికి పార్టీని శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్రకార్యదర్శి బాలకృష్ణయాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, టీడీపీ నేత బి.హరిప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, కార్యదర్శి చాగలమర్రి ఓబులయ్య, బీజేపీ నేతలు బొమ్మన సుబ్బరాయుడు, గోసుల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైవీయూలో ఉద్యోగ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ కళాశాల ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ఉద్యోగాల ఎంపికకు ప్రముఖ మల్టీ నేషనల్ బయో ఫార్మస్యూటికల్ కంపెనీ బయోకాన్ రానుందని తెలిపారు. ఆ కంపెనీ ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, డిప్లమో కెమికల్, బీటెక్ కెమికల్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగాల కోసం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ అర్హతలు ఉండాలన్నారు. ఇంజనీరింగ్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలలో ఉద్యోగాల కోసం మెకానికల్, ఈఈఈ, ఈసీ, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ, బీటెక్, డిప్లమో చదివినవారు అర్హులన్నారు. 2023, 2024, 2025 బ్యాచ్‌లలో చదివిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు మాత్రమే డ్రైవ్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు. విద్యార్థులు వారి బయోడేటాతో ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలన్నారు.

వైవీయూ దూర విద్య పీజీ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ దూరవిద్య పీజీ మొదటి, రెండవ సెమిస్టర్ల ఫలితాలను సీడీఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి సీడీఓఈ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1, 2 సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించామన్నారు. ఫస్ట్ సెమిస్టర్ ఆర్థిక శాస్త్రం, ఇంగ్లీష్, చరిత్ర, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, రాజకీయ శాస్త్రం, మనస్తత్వశాస్త్రం, వాణిజ్య శాస్త్రం కోర్సులలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ప్రత్యేక తెలుగులో 80శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 2వ సెమిస్టర్‌లో ఆర్థిక శాస్త్రం 93శాతం, ఇంగ్లీష్ 88శాతం, చరిత్ర వందశాతం, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం 88శాతం, రాజకీయ శాస్త్రం 79శాతం, మనస్తత్వశాస్త్రం 96శాతం, వాణిజ్య శాస్త్రం 75శాతం, ప్రత్యేక తెలుగులో 93శాతం ఫలితాలు వచ్చాయన్నారు.

మామిడికి కవర్



మామిడి కాయకు రక్షణ కవర్

- రైతులకు కోటి కవర్ల పంపిణీ లక్ష్యం
- 50 శాతం సబ్సిడీతో...
- రైతుకు లాభం..వినియోగదారుడికి తియ్యని రుచులు

వేసవి వచ్చిందంటే మధురఫలం..మామిడి పండు రుచిచూడని వారుండరంటే అతిశయోక్తి కాదు. అటువంటి మామిడి పండు పూత నుంచి పిందె, కాయ, పక్వానికి వచ్చే సరికి 120 రోజులు పడుతుంది. చీడపీడలు, వాతావరణ పరిస్థితులను ఎదుర్కొని నిలిచిన మామిడి పండే మన నోటికి అందుబాటులోకి వస్తుంది. అటువంటి మామిడి పండు పరిరక్షణకు ఉద్యానశాఖ అధికారుల సహకారంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ నేతృత్వంలో మామిడి కాయ పక్వ దశకు వచ్చే వరకు రక్షణ కవచంగా ప్రత్యేక కవర్ల విధానం అమలులోకి తీసుకొస్తున్నారు.

పురుగులతో మామిడికి దెబ్బ

మామిడిసాగులో పూత నుంచి పిందె దశకు వచ్చే వరకు 60 రోజుల సమయం పడుతుంది. జనవరిలో మొదలయ్యే పూత ఫిబ్రవరి ఆఖరుకు పిందె దశకు వస్తుంది. ఈ పిందె కోడి గుడ్డు సైజు వచ్చే సరికి ఊజి పురుగు దాడి చేస్తుంది. ఈ ఊజి పురుగు మామిడికాయపై చిన్నగా కాట్లు వేసి రంధ్రాలు చేసి అందులో గుడ్లను విడిచి పెడుతుంది. ఈ గుడ్లు కాయతో పాటు పెరిగి పురుగులు ఏర్పడి మామిడి పండును తినడానికి కూడా పనికిరాకుండా చేస్తాయి. అలాగే కాయ పక్వానికి వచ్చే దశలో గొంగళి పురుగు దాడి చేస్తుంది. కాయపై బొక్కలు పెట్టి, కాడ పలచబడేలా చేసి చెట్టు నుంచి కాయ కిందకు పడేలా చేసేస్తుంది. ఎర్రనల్లి, నల్లనల్లి పురుగు (త్రిప్స్) మామిడి కాయపై పొర కొరుకుతూ వాతలు పెడుతుంది. ఈ వాతలతో నల్లమచ్చలు ఏర్పడి మంగులా తయారవుతాయి. ఈ కాయలు తినడానికి కూడా పనికి రాకుండా పోతాయి. వీటికి అదనంగా ఎండ, వాన, గాలి తదితర వాతావరణ పరిస్థితులతో మామిడి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది.



మామిడిపండుపై గొంగళి పురుగు దాడి (ఫైల్)



ఎర్రనల్లి పురుగుదాడి చేయడంతో దెబ్బ తిన్న మామిడి పండు (ఫైల్)

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా బేనీషా రకం మామిడి తోటలు సాగవుతున్నాయి. వీటితో పాటు జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో నీలం, ఇమామ్‌పసంద్, కేసరి రకం మామిడి తోటలు, జ్యూస్ ఫ్యాక్టరీకి తరలించే మామిడి బెంగళూరు రకం తోటలు కూడా సాగవుతున్నాయి. 1700 హెక్టార్లలో బేనీషా రకం మామిడి కాయల పరిరక్షణకు తొలివిడతగా ఉద్యానశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా చైనా నుంచి దిగుమతి చేసుకున్న ప్రత్యేక సంచులను 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయనున్నారు. మల్చింగ్ పేపర్ తరహాలో లోపల నల్లని కవరు, బయట మైనం కోటింగ్‌తో ఉండే ఈ సంచులు 20 సెంటీమీటర్ల వెడల్పు, 30 సెంటీ మీటర్ల పొడవు, 15కు 25 సెంటీమీటర్ సైజులతో రెండు రకాలుగా సంచులు తెప్పిస్తున్నారు. సంచి మొదట్లో జీఐ వైరు ఉండటం వలన కాయ మీద ఒత్తిడి లేకుండా కేవలం కాడతోనే జీఐ వైరు ఉండే సంచిని అమరుస్తారు.

50 శాతం సబ్సిడీతో కోటి సంచుల పంపిణీకి చర్యలు

జిల్లాలో మామిడి రైతులకు ప్రత్యేక సంచుల అవసరం గురించి ఉద్యానశాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ఒక ఎకరాకు 4 టన్నులు (12 వేల కాయలు) లెక్కన ఈసారి సీజన్‌లో కోటి సంచులను రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వాస్తవంగా ఈ సంచులు ఒక్కొక్కటి రూ.2.40 పైసలు ధరకు కొనుగోలు చేసి 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తారు. ఒక్కో సంచి రూ.1.20 పైసలు కొనుగోలు చేసే రైతులు వీటిని కాయలకు తొడిగేందుకు మరో కూలి రూ.1.20 ఖర్చు చేయాల్సి వస్తుంది. కేవలం ఒక్కో కాయకు రూ.4 వరకు మాత్రమే ఖర్చు వచ్చే క్రమంలో ఈ సంచులతో ఉపయోగాలు అనేకం ఉన్నాయి. దీంతో రైతులు వీటిపై పలుచోట్ల ఆరా తీస్తున్నారు.

ఆలస్యంగా మామిడి దిగుబడి

సాధారణంగా జిల్లాలో మామిడి సాగు జనవరి నుంచి మే వరకు సాగి మే నెలాఖరు జూన్ నెలల్లో మామిడి పండ్లు తినడానికి సిద్ధమవుతాయి. కాగా ఈసారి జనవరి నెలలో కొన్నిచోట్ల మామిడి పూత విరగ్గాసింది. కానీ ఎండ వేడిమికి పూత అంతా రాలిపోయి, ఒక నెల ఆలస్యంగా పక్వానికి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. అంటే సుమారు 20 రోజుల సీజన్ ఆలస్యమయ్యే సూచనలున్నాయి. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలతో పోలిస్తే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో వాతావరణం చల్లగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతాల్లో ఆలస్యంగా మామిడి కోతలు పడతాయి. అంటే మరో 20 రోజుల్లో తూర్పు ప్రాంతాల్లో మామిడికాయలు కోడిగుడ్డు సైజుకు రానున్నాయి. ఆ తరువాతనే ప్రత్యేక సంచులను కాయలకు తొడుగుతారు. దీనిని బట్టి చూస్తే మరో 20 రోజుల్లో రాజంపేట, రైల్వేకోడూరు, తరువాత పీలేరు, రాయచోటి, మదనపల్లె ప్రాంతాల్లో కాయలకు ప్రత్యేక సంచులు కట్టనున్నారు.

ప్రత్యేక సంచులతో రక్షణ

మామిడి కాయలను పరిరక్షించడానికి ప్రత్యేకంగా తయారు చేసిన సంచులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా ఊజి, గొంగళి, ఎర్రనల్లి, నల్ల నల్లి పురుగుల దాడుల నుంచి ఈ సంచులు కాపాడతాయి. మామిడికాయ కోడిగుడ్డు సైజుకు వచ్చే సరికి ఈ సంచులను కాయలకు తొడుగుతారు. మామిడి కాయ కాడ ఆధారంగా సంచుల్లోనే పెరిగి పెద్దవి అవుతాయి. 60 రోజుల వరకు ఈ సంచులు రక్షణ కవచంలా ఉంటాయి. దీంతో పాటు కాయ పెరిగే సాధారణ సైజు కన్నా 10 శాతం అదనంగా బరువు పెరుగుతుంది. పురుగు మందులు మామిడికాయకు తగిలే అస్కారం లేకపోవడంతో ఆర్గానిక్ తరహా కాయలు మార్కెట్‌కు వస్తాయి. ఎండ నుంచి రక్షణ ఇవ్వడంతో పాటు ఎనిమిది గంటల ఏకధాటి వర్షానికి కూడా ఈ సంచులు తడవకుండా కాయకు రక్షణ కల్పిస్తాయి. 40 కిలోమీటర్ల వేగంతో వీచే గాలుల నుంచి కూడా కాయలు కిందపడకుండా కాడల ఆధారంగా ఈ సంచులు రక్షణ ఇస్తాయి. ఇన్ని విధాల రక్షణ కల్పించే మామిడి ప్రత్యేక సంచులకు త్వరలో డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది.



ప్రత్యేక సంచుల్లో పెరిగి ఎగుమతికి సిద్ధమైన మామిడి పండ్లు (ఫైల్)





కాయలకు తొడిగిన ప్రత్యేక సంచులు (ఫైల్)

ప్రణాళికాబద్ధంగా సంచులు తెప్పిస్తాం

జిల్లాలో మామిడి సాగు 20 నుంచి 30 రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీని ఆధారంగా ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక సంచులు దిగుమతి చేయిస్తున్నాం. పాసుపుస్తకాలు ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో ఈ సంచులు అందిస్తాం. పాసుపుస్తకాలు లేని వారు బయట దుకాణాల్లో ఈ సంచులు కొనుగోలు చేసుకోవచ్చు. జిల్లాలో కోటి సంచుల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నాం.

- రవిచంద్రబాబు, ఉద్యాన శాఖ, జిల్లా అధికారి, రాయచోటి.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం స్వాధీనం



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కురబలకోట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ బండపల్లె సమీపంలో గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలో బండపల్లె సమీపంలో సర్వేనంబర్ 582లోని 79 సెంట్లలోని కొంత స్థలంలో ఆర్‌బీకే రోడ్డు నిర్మించారు. వాటికి పోగా మిగిలిన దాదాపు 30 సెంట్ల స్థలాన్ని కొంతమంది వైసీపీ నేతల అండతో ఆక్రమించు కున్నారు. ఈ విషయం స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో అధికారులు స్పందించారు. ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్ధారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తపస్విని మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా భూములను ఆక్రమించుకుని ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సుబ్రమణ్యం, వీఆర్వోలు ఖాదర్‌బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోండి

- ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సమ్మర్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రారంభమైన సమ్మర్ క్లాసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులతో ఈ నెల 1 నుంచి 23వ తేది వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సమ్మర్ క్లాసులు జరుగుతున్నాయన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడమే కాకుండా వెనుకబడి ఉన్న విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో సమ్మర్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 24 నుండి మే 31వరకు వేసవి సెలవులు ఉంటాయని, జూన్ 2 నుండి తిరిగి కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

కలికిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కలికిరి పంచాయతీలోని చిన్నమాలపల్లె దళితవాడలో బుధవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు దళితుల హక్కని స్పష్టం చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస వర్మ, ఏసురాజు, తహసీల్దారు మహేశ్వరిబాయి, వీఆర్వోలు, గ్రామ పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



కలికిరి చిన్నమాలపల్లె మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

శ్మశానవాటికలో క్షుద్ర పూజలు...!

- ఆందోళనలో ఇందిరమ్మకాలనీ వాసులు

గుర్రంకొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశానం, పొలాల్లో కొన్ని రోజులుగా క్షుద్రపూజలు చేస్తుండంతో ఇందిరమ్మకాలనీ, జగనన్న కాలనీ వాసులు ఆందోళనకు గురవున్నారు. కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు బయటి ప్రాంతాల నుంచి మాంత్రికులను పిలిపించి పూజలు చేయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని ఇందిరమ్మకాలనీలో 650 కుటుంబాలు, జగనన్న కాలనీలో 300 కుటుంబాలు ఉన్నాయి. ఈ కాలనీలో ఇళ్లను నిర్మించుకున్న పలువురు వాటిని ఇతరులకు బాడుగకు ఇచ్చారు. మరి కొందరు ఇళ్లను అమ్ముకోవడంతో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు కొనుగోలు చేసి నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు కాలనీల్లో ఎక్కువ శాతం బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులే ఉన్నారు. వీరిలో కొందరు నేరచరిత్ర కలిగిన వారు ఉన్నట్లు కాలనీ వాసులు గుసగుసలాడుతున్నారు. కాగా, కాలనీలో ఉన్న కొందరు వ్యక్తులు గుప్త నిధులు, క్షుద్ర పూజల ముఠాలను పిలిపించి చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షుద్రపూజలతో పాటు తవ్వకాలు చేస్తున్నట్లు కాలనీ వాసులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మధు రామచంద్రుడు మాట్లాడుతూ గుర్రంకొండ ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, కొత్త వ్యక్తుల వివరాలను సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు.



క్షుద్ర పూజలు చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రాంతం, వినియోగించిన వస్తువులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని పశువుల ఆసుపత్రి సమీపంలో నివాసం ఉంటున్న తమ్మిశెట్టి రత్నమయ్య (30) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో సీలింగ్ ఫ్యానుకు తన పంచెతో ఉరి వేసుకున్నాడు. కుటుంబీకులు గమనించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి వెంకట్రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న రత్నమయ్య

రక్షణ కోరిన ప్రేమజంట



పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రేమజంట

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ జంట బుధవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన సిసింద్రీ (23) కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, మదనపల్లె మండలం, బోడుమోళ్లదిన్నెకు చెందిన శ్రావణి (22) డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. డిగ్రీ చదువుకునే రోజుల్లో వారు ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో ఇరువురి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో ఇటీవలే ఇంట్లో నుంచి వెళ్లిపోయి ప్రేమవివాహం చేసుకున్నారు. అనంతరం రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. తన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందంటూ శ్రావణి తన ఫిర్యాదులో పేర్కొంది. ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ, సబ్‌కలెక్టర్

రాజంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అధికారులు రెవెన్యూ చట్టాలు, మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ ఆడిటోరియంలో డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా జవాబుదారితనంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్‌మెంట్ భూములపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవస్థలో లోపాలు సరిద్దిద్దుకొని ముందుకు వెళ్లినప్పుడే పనితీరు మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను బాధ్యాతయుతంగా పూర్తి చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు పాటించాలన్నారు. సబ్‌కలెక్టర్ నిధియాదేవి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల నిర్వాహకుల నుంచి డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్లు, విద్యాసంస్థల ప్రతినిధులు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం అనుమతులు ఇస్తోందన్నారు. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కింద ఆర్థిక సహాయం కూడా చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అర్హత ప్రమాణాలతో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రుణ ప్రణాళికను సక్రమంగా నమోదు చేయాలి

వీరబల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సభ్యుల జీవనోపాధులు, కుటుంబ అవసరాల రుణ ప్రణాళికలు సక్రమంగా నమోదు చేయాలని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ గంగార్జున, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏలు, ఎన్యుమరేటర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 660 స్వయం సహాయక సంఘాలకు గానూ ప్రతి 6 సంఘాలకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 106 మందికి శిక్షణ ఇచ్చి సంఘాల సభ్యులందరితో ముఖాముఖి చర్చించి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు నాగేంద్ర, కృష్ణయ్య సుధాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

జనసేన నేతపై దాడికి యత్నం

వీరబల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన మండల కన్వీనర్, వార్డు మెంబర్ గుగ్గిళ్ల వెంకటేష్‌పై సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు, వారి కుటుంబ సభ్యులు మారణాయుధాలతో దాడికి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. అయితే వెంకటేష్ త్రుటిలో తప్పించుకొని పారిపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడన్నారు. గతంలో సర్పంచ్ దాదాపు రూ.26 లక్షల అవినీతి చేసినట్లు కలెక్టరుకు తాను ఫిర్యాదు చేయడంతోనే తనపై కక్ష పెంచుకొని ఇలా దాడికి యత్నించినట్లు బాధితుడు తెలిపాడని అంటున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి విచారించారు. కాగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, జనసేన రాజంపేట నియోజకవర్గ సమన్వయకర్త దినేశ్ బాధితుడిని పరామర్శించారు.

యూట్యూబర్స్‌పై కేసు నమోదు

రైల్వేకోడూరురూరల్,ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇద్దరు యూట్యూబర్స్ మరొక విలేకరి (ఆంధ్రజ్యోతి కాదు)పై సీఐ కె.హేమసుందర్ బుధవారం కేసు నమోదు చేశారు. యూట్యూబర్స్ ముప్పాల శంకర్‌రాజు, సత్యనారాయణ రెడ్డి, విలేకరి గూడూరు సుబ్రహ్మణ్యం రాజు తన విధులకు ఆటంకం కలిగించి, తప్పుడు వార్తలు ప్రచురించి, డబ్బుల కోసం బెదిరించారని కోడూరు రేంజర్ పీఏ శ్యాంసుందర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

- ఎంపీ మిథున్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఒంటిమిట్టలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన రైల్వేబోర్డు చైర్మన్ సతీష్, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు లేఖ రాశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కోదండరాముడి దర్శనానికి వస్తారని, వారి సౌకర్యార్థం ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో తిరుమల, వెంకటాద్రి, రాయలసీమ, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని లేఖలో పేర్కొన్నారు.

ఘర్షణలో వృద్ధుడికి గాయాలు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఓ వృద్ధుడు గాయపడినట్లు ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు. పీటీఎం మండలం, రాఘూరివారిపల్లె గ్రామం, కొత్తపల్లెకు చెందిన యర్రంరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి (74)కు డి.నారాయణపల్లె వద్ద నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో తమకు భాగం ఉందని రామకృష్ణారెడ్డికి వరుసకు మనుమళ్లు అయిన ప్రతాప్‌రెడ్డి, శబరీష్‌రెడ్డిలు బుధవారం పొలం వద్ద ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో రామకృష్ణారెడ్డి తలపై వారు కర్రతో దాడి చేశారు. దీంతో గాయపడిన వృద్ధుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పీటీఎం ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై గతంలో కూడా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లె గ్రామానికి చెందిన గోపినేని మహేశ్వరి మెడలో ఉన్న బంగారు గొలుసు (సరుడు)ను దొంగ లాక్కొనిపోయినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహేశ్వరి బుధవారం ఉదయం ఆమె తల్లితో కలిసి గేదెలను మేపుకొనేందుకు అడవికి వెళ్లారు. తల్లి అడవి లోపలికి వెళ్లడంతో మహేశ్వరి ఇంటికి బయలుదేరింది. దారిలో వర్మీకంపోస్టు డంపింగ్ యార్డు వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి తన మెడలోని తాలిబొట్టు సరుడును లాక్కొనేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో దొంగ కత్తి చూపించి భయపెట్టి బంగారు సరుడును లాక్కొని వెళ్లిపోయినట్లు తెలిపారు. సరుడు 3 తులాలు ఉంటుందని, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతా...గందరగోళం

- జీవనోపాధికి ఇచ్చిన పౌల్ట్రీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు
- అధికారుల వద్ద రెండు రకాల జాబితాలు
- దిక్కుతోచని స్థితిలో అధికారులు
- దుర్వినియోగమైన స్థలాల స్వాధీనంలో మీనమేషాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ భూములను పరిరక్షించుకోవడం అంత సులువు కాదనిపిస్తోంది. కొంతమంది కార్యాలయ సిబ్బంది సహకారంతో ఏకంగా ఫైళ్లు తారుమారు చేసినట్లు స్పష్టం అవుతోంది. దీంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నా ఫైళ్లన్నీ గందరగోళంగా ఉన్నాయి. ఈ క్రమంలో వారు పెద్దగా ఆసక్తిచూపకపోవడతో ఆక్రమంచిన వారివే ఆస్తులు అనే విధంగా పరిస్థితులు తయారయ్యాయి. అక్రమార్కులు ఇచ్చే ముడుపులకు ఆశపడి కొంతమంది సిబ్బంది వివిధ సందర్భాలాల్లో ఎస్సీ కార్పొరేషన్ కార్యాల యంలోని రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి.

జీవనోపాధికి అవకాశం ఇస్తే...

కోళ్ల (పౌల్ట్రీ) పరిశ్రమ ద్వారా ఎస్సీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో 1984-85 సంవత్సరంలో ఉమ్మడి కడప జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. కొంతకాలం బాగానే ఉన్నప్పటికి కాలక్రమేణా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిల్లో రాజంపేట మండలలోని తాళ్లపాక వద్ద నిర్మాణం చేసిన పౌల్ట్రీ కాంప్లెక్స్ కడప-తిరుపతి ప్రధాన దారి పక్కనే ఉండడం వల్ల లబ్ధిదారుల్లోని కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీనికి ఎవరూ అడ్డుచెప్పకపోవడంతో నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇంతలో ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు ఏర్పాటు కావడంతో ఇళ్లస్థలాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం అక్కడ సెంటు స్థలం రూ.12లక్షలు నుంచి రూ.15లక్షలు వరకు ధర పలుకుతోంది. ఇదే అదునుగా భావించిన లబ్ధిదారుల్లోని కొంతమంది ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ స్థలాన్ని వ్యాపారానికి తెరలేపారనేది సమాచారం. అక్కడ తాము ఆక్రమించుకున్న స్థలంలో కొంతభాగాన్ని విక్రయంచగా వచ్చిన



పౌల్ట్రీస్థలంలో విచారణ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ (ఫైల్)

సొమ్ముతో విలాసవంతంగా భవనాలు నిర్మించుకుంటున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎస్సీ కార్పొరేషన్‌లోని కొంతమంది సిబ్బంది కూడా పరోక్షంగా లబ్ధిపొందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో లబ్ధిదారుల జాబితా కూడా ట్యాంపరింగ్‌కు సిబ్బంది పాల్పడినట్లు సమాచారం.

రెండు జాబితాలు.. ఏదీ వాస్తవం

పౌల్ట్రీ లబ్ధిదారుల జాబితాలో గందరగోళం ఏర్పడింది. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలోనే రెండు రకాల జాబితాలు ఉంటున్నాయి. ఒక జాబితాలో 2019వ సంవ త్సరంలో అప్పటి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మురళీమనోహర్ సంతకం చేసిన జాబితాలో 30 మంది లబ్ధిదారుల పేర్లు ఉన్నాయి. కానీ ఇపుడు మాత్రం తెరపైకి 20 మంది పేర్లతో ఉన్న జాబితా వస్తోంది. ఈ రెండు జాబితాలో ఏది వాస్తవం అనేది అర్థం కాని పరిస్థితి. ఎస్సీలలోనే ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల పేర్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 1984-85 సంవత్సరాలలో రూపొందించిన జాబితలో ఎక్కడ ఉండేది ఎవరికి తెలియని పరిస్థితి కనిపిస్తుంది. ఇదిలా ఉంటే 2019లో ఈడీ మురళీమనోహర్ సంతకంతో ఉన్న జాబితాను పరిగణలోకి తీసు కుంటారా లేకుంటే ఏ అధికారి సంతకం లేని 20 మంది పేర్ల జాబితాను పరి గణలోకి తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎందుకంటే ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారుల జాబితా అడిగతే 20 మంది పేర్లు ఉన్న జాబితానే ఇస్తున్నారు. పౌల్ట్రీ కాంప్లెక్స్‌లో మొదటి నుంచి ఉపాధి పొందిన వారిలో కొంతమంది కాంప్లెక్స్ శిథిలావస్థలకు చేరుకోవడంతో వదిలిపెట్టారు. కానీ ఇపుడు మాత్రం అధికారులు తిరిగి పౌల్ట్రీస్థలాన్ని పరిశీలిస్తుండడంతో జాబితాలో తమ పేర్లు ఉన్నా యంటూ కొంతమంది లబ్ధిదారులు వెలుగులోకి వస్తున్నారు. కానీ నూతనంగా రూపొందించిన జాబితాలో మాత్రం 20 పేర్లు మాత్రమే ఉండడం అనుమానం కలిగిస్తోంది. దీంతో తమ పేర్లు అధికారిక జాబితాలో ఉన్నాయా లేదా అనే ఆందో ళన కొంతమంది లబ్ధిదారుల్లో నెలకొంది. అధికారులు సైతం ఈ అంశంపై దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు సమాచారం.

స్థలాల స్వాధీనంలో మీనమేషాలు

వాస్తవానికి ఎస్సీ కార్పొరేషన్ కేవలం జీవనోపాధుల కల్పన కోసమే కాంప్లెక్స్ కట్టిం చారు. అయితే అవి కూలిపోయి నిరుపయోగంగా మారడంతో పాటు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో తమ భూములు స్వాధీనం చేసుకునే దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కానీ తమ భూములు హద్దులు చూపడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు చర్చ సాగుతుంది. ఈ విషయాలపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అన్ని రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి : డీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. బుధ వారం చెన్నూరు గ్రామ పంచాయతీలో పంచాయతీలో ఘన, వ్యర్థాల నిర్వహణపై క్లాప్ (గ్రీన్‌అంబాసిడర్స్) మిత్రలు, పంచాయతీ కార్యద ర్శులకు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎస్.వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ భూమిపై ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేసి భూశక్తిని నాశనం చేయవద్దన్నారు. ప్రతి షాపుల్లోవాడే ప్లాస్టిక్‌ను పరిశీలించాలని.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మ కుండా చేయాలన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్ర మిస్తే కేసులు నమోదు చేసే అధికారం పంచాయతీకి ఉందన్నారు. పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకూడద న్నారు. జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ గ్రామ పంచా యతీల్లో నీరు, పారిశుధ్యం నిర్వహణ ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం చెన్నూరులోని ఎస్‌డబ్ల్యుపీసీని సందర్శించి పంచాయతీలో సేకరించిన వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాను పరిశీలించారు. అలాగే వానపాముల ఎరువు ఎలా తయారు చేస్తున్నారు, రైతులకు ఎంతకు అమ్ముతున్నారని ఈవోపీఆర్‌డీని అడిగి తెలుసుకున్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష



మాట్లాడుతున్న అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా కేంద్రం లోక్‌సభలో వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ 2025 బిల్లును తీసు కువచ్చిందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష తెలిపారు. దీనికి పార్లమెంటులో టీడీపీ ఎంపీలు మద్ద తు పలకడం బాధాకరమన్నారు. బుధవారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఈ బిల్లును ప్రవేశపెట్టారని ఆరోపించారు. 1954లో వక్ఫ్ చట్టం మన దేశంలో అమలులోకి వచ్చిందన్నారు. ప్రధాని మోడీ దుర్మార్గమైన పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం మతాలను కులాలను చీల్చాలని చూడడం దారుణమన్నారు. ఈబిల్లుకు పార్ల మెంటులో కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం బాధాకరమన్నారు. మాజీ హజ్ కమిటీ చైర్మన్ గౌసలాం, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



గ్రామ సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాల సముదాయాలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణ కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమా ర్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు నియోజకవర్గం కొత్తపల్లె పంచాయ తీ కానపల్లెలో గ్రామ సచివాలయం, గ్రామీణ ఆ రోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాల సముదాయా లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం లో పేదల ఆరోగ్య సంరక్షణ కోసం కూటమి ప్ర భుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోందన్నారు.ప్ర జా ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,260 హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్న తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ మహమ్మారిని త రిమికొట్టడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నా రు. ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్, ఉపా ధి హామీ నిధులను పక్కదారి పట్టించడంతో పల్లె సీమలు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయ న్నారు. దశాబ్దాల కాలంగా కడప పార్లమెంటు, ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఒకే కుటుంబం చేతి లో ఉండిపోయాయని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పదవులు వెలుగబెట్టి నా కనీసం సొంత జిల్లా అభివృద్ధి నామమాత్రమే అన్నారు. గండికోట జలాలకు సంబంధించి పిల్ల కాలువలు తవ్వడం, అన్నమయ్య డ్యాం తెగిపోవ డం, కడప స్టీల్‌ప్లాంట్‌కు నాలుగుసార్లు భూమి పూజ చేసి చెల్లికి జరగాలి పెళ్లి మళ్లీ మళ్లీ అన్న చందంగా పరిపాలన సాగిందని ఆయన విమ ర్శించారు.

ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే ఆదినారా యణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను స ద్వినియోగం చేసుకోవాలని, పీ4 విధానాన్ని అమ లుపరిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నా రు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు దుర్మార్గమైన పాలనను తరిమి కొట్టి అభివృద్ధి చేసే కూటమి ప్రభుత్వానికి ప ట్టం కట్టారన్నారన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వం లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయ నిస్తుందని చెప్పారు. జిల్లాతోపాటు నియోజకవ ర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నారని చెప్పారు. కలెక్టర్ చెరుకూ రి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్ర జలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు, కొ త్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ నం ద్యాల రాఘవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బి రెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, కొత్తప ల్లె ఎంపీటీసీ గోపాల్, జమ్మలమడుగు ఆర్డీవో సా యిశ్రీ, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య, ఎం పీడీవో సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ ఉపకమిషనర్ శ్రీకాంత్‌నాయక్

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మికశాఖ ఉపకమిషనర్ శ్రీకాంత్‌నాయక్ పేర్కొన్నారు. జిల్లాలోని గిగ్ ప్లాట్ ఫాం వర్కర్లకు అవగాహన సదస్సును బుధవారం ఎన్జీవో కాలనీలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ సుమారు 600 మంది ప్లాట్‌ఫాం వర్కర్స్ జుమాటో, స్విగ్గి, ఓలా, ఉబర్ రాపిడో వంటి వాటిలో పని చేసేవారు ఉన్నారన్నారు. వీరంతా ఆధార్, పాన్, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు కలిగి ఉండాలన్నారు. నమోదు ప్రక్రియను సెల్ఫ్ రిజిస్ట్రేషన్, సీఎస్‌సీ సెంటర్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవచ్చునని తెలిపారు. సదస్సులో హోటల్ యజమా నులు, ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ సంస్థ వారు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తుల అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న సీఐ రోషన్, పక్కన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని మందలించినందుకు కక్ష కట్టి కత్తితో దాడి చేసి గాయ పరిచిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్లు సీఐ రోషన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్ రెడ్డితో కలిసి వివరాలు వెల్ల డించారు. కమలాపురం టౌన్ ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ సల్మాన్ అనే వ్యక్తి తన బైకుపై ఆక్సనగర్ వీధుల్లో వేగంగా తిరు గుతుండగా.. అదే ఏరియాకు చెందిన షేక్ సోహైల్ అనే వ్యక్తి మందలించా డు. ఈ విషయం మనసులో పెట్టుకుని సల్మాన్ తన తండ్రి మహబూబ్ షరీఫ్‌తో కలిసి గత నెల 31న రాత్రి సోహై ల్ తన ఇంటి ముందు నిలబడి ఉండగా కత్తితో మెడపై పోడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమ యంలో విడిపించడానికి వెళ్లిన షబాజ్, రియా జ్‌లపై దాడి చేసి గాయ పరిచారు. ఈ కేసులోని నిందితులను బుధవారం ఉదయం ఎస్ఐ యు.ప్రతా ప్‌రెడ్డి సిబ్బందితో కలసి అరెస్టు చేశారన్నారు. నేరానికి ఉపయో గించిన కత్తితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి గొర్రెల కాపరి మృతి



హృదయరాజు మృతదేహం

బద్వేలు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని కోనసముద్రం గ్రామ సమీ పంలోని బావిలో నీటిని తాగేం దుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి గొర్రెల కాపరి హృదయరాజు (32) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరా లిలా.. బి.మఠం మండ లం టి.రామాపురం గ్రామానికి చెందిన హృదయరాజు కుటుంబీ కులు గొర్రెల కాపరులుగా జీవనం సాగిస్తున్నారు. బుధవారం కోన సముద్రం గ్రామ సమీ పంలో పొలాల్లో గొర్రెలు మేపుకుంటూ మధ్యాహ్న సమయంలో నీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో గొర్రెలు మేపు తున్న సహచరులు బావి వద్దకు వెళ్లి చూడగా చెప్పులు, కర్ర బయటే ఉండ టంతో గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు బావి వద్దకు వచ్చి వెదకగా హృద యరాజు మృతదేహం బయట పడింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బద్వేలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి.. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

కొండాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామ సమీపంలో బుధవారం సాయింత్రం ఆటో బోల్తా పడిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండలంలోని తిమ్మాపురం గ్రామం నుంచి తాడిపత్రికి వెళుతున్న ప్యాసింజర్ ఆటో సుగుమంచిపల్లెకు రాగానే ముందు టైరు పగిలింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ కేశవతో పాటు, మరో ఇద్దరు పుల్ల య్య, ఓబులేసుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహ నంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముగ్గురు క్రికెట్ బుకీల అరెస్టు

- రూ.55వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్ట్ కాలేజీ కాంపౌండ్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహి స్తున్న ముగ్గురు బుకీలను వన్‌టౌన్ ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల నగదు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. అరెస్టు అయిన క్రికెట్ బుకీల్లో ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన ఊట్ల మధుసూదన్ (45), దొరసానిపల్లె రోడ్డు కూల్‌డ్రింక్ షాపు చాకలి పెద్ద నరసింహులు (55), సూప ర్‌బజార్ రోడ్డుకు చెందిన మల్లెల నరసింహారెడ్డి (44) ఉన్నారు. వీరంతా ఐపీఎల్ లీగ్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి.. లావాదేవీలు పంచుకుం టుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంకా ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.

వేంపల్లెలో వరుస చోరీలు భయాందోళనలో ప్రజలు

వేంపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాం దోళనకు గురవతున్నారు. ఎక్కువగా చిల్లర దొంగతనాలు ప్రతిరోజు ఏదొకచోట జరుగుతూనే ఉన్నాయి. తాజాగా స్థానిక కడప రోడ్డులోని ఇందు ట్రావెల్స్ కార్యాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీ చేశా రు. రూ.45వేలు నగదు తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపా రు. మెయిన్ బజార్‌లోని మెయిన్ స్కూల్‌లో ఉన్న అంగ న్వాడీ కేంద్రంలో 30 ప్యాకెట్ల కందిబేడలు, నాలుగు డబ్బాల పాల ప్యాకెట్లు గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. గత కొన్ని రోజులుగా పులివెందుల రోడ్డులోని పలు బంకుల్లో బీగాలు పగులగొట్టి లోపలున్న వస్తువు లను చోరీ చేస్తున్నారు. పలువురు బాధితులు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసి.. వరుస దొంగతనాలను అరి కట్టాలని కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మారు తీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలి పారు. మారుతీనగర్‌కు చెందిన పెయింటర్ బాబ్జి (36)తో భార్యకు మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె ముగ్గురు పిల్లలతో 5 సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై బాబ్జి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి... కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించా లని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రి కేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చక్రాయపేట, కమలాపురం, వేము ల తదితర మండలాల్లో ఇప్పటికీ కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు వాస్తవాలు క్షేత్ర స్థాయిలో పునఃపరిశీ లించి కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాగా, వక్ఫ్ బిల్లుకు కూటమి సర్కారు మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నేతలు బండిజకరయ్య, ఎస్ఏ సత్తార్, సలావుద్దీన్, సిరాజుద్దీన్, సంజయ్ కాంత్. అశోక్ రెడ్డి, మామిళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

16న మత్స్య సహకార సంఘాల ఎన్నికలు

- ఎన్నికల షెడ్యూల్‌ను జారీ చేసిన కలెక్టర్

కడప రూరల్, ఏప్రిల్ 2: జిల్లాలో మత్స్య సహకార సంఘాల ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) మంగళవారం ఎన్నికల షెడ్యూల్ జారీ చేశారు. ఈ నెల 16వ తేదీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిం చారు. ఈ మేరకు జిల్లాలోని జీవీ సత్రం, నరసాపురం, బద్వేల్, చిన్నసింగనపల్లి, యర్రబల్లి మత్స్య సహకార సంఘాలకు నూతన పాలకవర్గ సభ్యులను (చేతులు ఎత్తు పద్ధతి ద్వారా) ఎన్నుకోనున్నారు. ఇందులో సంబంధిత మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం కలి గిన సభ్యులకు మాత్రమే ఓటు హక్కు కలిగి ఉంటారు. ఈ మేరకు మత్స్య సహకార ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలను చేపట్టిందని ఉప మత్స్య సంచా లకులు కె. శాంతి తెలిపారు.

కడప సీసీఎస్ సీఐగా కృష్ణమరాజునాయక్ బాధ్యతలు

కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప సీసీఎస్ పోలీసుస్టేషన్ సీఐగా కృష్ణం రాజు నాయక్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలోని పోరుమామిళ్ల, ప్రొద్దుటూ రు త్రీటౌన్, రాజుపాలెం, పెద్దముడియం, ఎర్రగుంట్లలో విధులు నిర్వహించారు. 2024లో సీఐగా పదోన్నతి పొంది ముదిగుబ్బలో పనిచేశారు. అక్కడ నుంచి ఒంటి మిట్టకు బదిలీ అయ్యారు. ఒంటిమిట్ట నుంచి ప్రస్తుతం సీసీఎస్-1గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థిని అదృశ్యం



కడప క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పుష్పగిరి స్కూలు సమీపంలో సాంఘిక సంక్షేమ గిరిజన స్కూలులోని విద్యార్థిని అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. 7వ తరగతి చదువుతున్న యశోద బుధవారం ఉదయం 7గంటలకు హాస్టలు నుంచి బయటికి వచ్చి అదృశ్యమై నట్లు తెలిపారు. విద్యార్థినికి మతిస్థిమితం సరిగా లేదని స్కూలు ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా మీకు లెక్కే లేదా..?

పదేళ్లుగా అడుగుతున్నా సర్వీసు రోడ్డు, డ్రైనేజీ, బస్‌షెల్టరు కట్టరా ● మండల సమావేశంలో హైవే సిబ్బందిపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

చెన్నూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క చెన్నూరు మండల కేంద్రంలోనే హైవే అధికారులు అభివృద్ధి పనులు ఎందుకు చేయలేదు, మీ నిర్వాకం వల్ల చెన్నూరు వద్ద ఎన్ని ప్రమాదాలు, ఎన్ని ప్రాణాలు పోయాయో తెలుసా, ఇంత దారుణం ఎక్కడైనా ఉందా, పదేళ్లుగా అడుగుతున్నాం. సర్వీసు రోడ్లు వేయరు, డ్రైనేజీ కట్టరు. బస్‌షెల్టరు ఏర్పాటు చేయరు, టోల్‌గేటు పెట్టి మాత్రం కావాల్సినంత మేర వసూలు చేసుకుని వెళ్లారు. ఇప్పుడు ఫోను చేసినా సరిగా స్పందించరు, పలకరు, మీ ఇష్టం వచ్చినట్లు చేస్తే చూస్తూ ఊరుకుంటామా అంటూ మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక ఇలాగైతే ప్రజలు అన్ని పార్టీల ప్రజానేతలతో కలిసి ధర్నాలు, ఆందోళనలు , రాస్తారోకోలు చెన్నూరు కొత్తరోడ్డులోనే పెడతాం అంటూ హెచ్చరించారు. చెన్నూరు మండల పరిషత్



హైవేలో అభివృద్ధి పనులు జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజా ప్రతినిధులు

సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రామనపల్లె ఉపసర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, రాచిన్నాయపల్లె, శివాలపల్లెకొండపేట సర్పంచ్‌లు వెంకట నారాయణరెడ్డి, సుదర్శనరెడ్డి, తుంగా చంద్రయాదవ్‌లతో పాటు ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు వారిష్ తదితరులు హైవేలో చేపట్టిన అభివృద్ధి పనులపై మండల సమావేశంలో ధ్వజమెత్తారు. ఏళ్ల జరుగుతున్నా ఇంత నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే చెప్పిన అభివృద్ధి పనులన్నీ చేయాల్సిందే. లేకుంటే హైవేనే ప్రజలతో కలిసి దిగ్బంధం చేస్తామని గట్టిగా హెచ్చరించారు.

అలాగే ఎంపీపీ సురేశ్ యాదవ్ మాట్లాడుతూ కనుపర్తి వద్ద జగనన్న కాలనీలో ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ నివాస గృహం గా ఎందుకు ప్రజలకు అందించలేదని, లబ్ధిదారుల నుంచి డబ్బులు కట్టించుకున్నారు, ఇలాగైతే ఎలా అని హౌసింగ్ ఏఈ మిలిన్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఏవో శ్రీదేవి, డిస్ట్రిబ్యూటరీ కమిటి చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి అర్హతే ఆధారం

పులివెందుల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధికి అర్హతే ఆధారమని, రాజకీయాలతో పని లేదని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని పలువురు ప్రజలకు సీఎం సహాయ నిధిచెక్కులను ఆయన బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు. 37 మందికి రూ.11,73,566 చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్న బీటెక్ రవి

ఎప్పటికీ కాంగ్రెస్‌తోనే.. అఫ్జల్‌ఖాన్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కడప కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి తాను రాజీనామా చేయలేదని,ఎప్పటికీ కాంగ్రెస్‌తోనే తన ప్రయాణమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాను నగర అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేశారని. దీన్ని తీవ్రంగా ఖండిసు న్నానన్నారు. ఒక వేళ తాను పార్టీకి రాజీనామా చేస్తే లేఖను పార్టీ అధిష్ఠానానికి పంపించానని మీడియా ముఖంగా చెప్పేవాడినన్నారు. ఈకార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు హమీద్, సత్తార్,దినకర్,కమాల్,బజ్బార్,అబిద్,మున్నా రంతుల్లా ఖాన్, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఏడాదైనా బాధితులకు న్యాయం జరగకపోవడం దారుణం'

కడప సెవెన్‌రోడ్స్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో హత్య చేస్తే కూటమి ప్రభుత్వంలో కూడా బాధితులకు న్యాయం జరగలేదు అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో గాలి చంద్ర మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులుయాదవ్ 2024 ఏప్రిల్ 2న కొంతమంది అత్యంత కిరాతకంగా పారలతో కొట్టి చంపేశారు, ఏడాది అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. హత్య చేసిన వారిని శిక్షించే వరకు బాధితులకు న్యాయం చేసే వరకు సమరశీల పోరాటాలకు సమాయత్తం చేస్తామని చంద్ర పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కడప కలెక్టరేట్ ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) ప్రముఖ సాహితీ వేత్త గానుగపెంట హనుమంతరావు వైఎస్సార్ కడప జిల్లాకే వన్నె తెచ్చారని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ప్రశంసించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో విశ్వావసు నామ ఉగాది రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని హనుమంతరావు అందుకున్న సందర్భంగా ఆయనను సత్కరించారు. ఈకార్యక్రమంలో బీసీ సంఘ అధ్యక్షులు లింగమూర్తి, గోవింద నాగరాజు, కార్యవర్గ సభ్యుడు అంజి, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నాగేష్, నాగమునిరెడ్డి, మల్లయ్య, రాధాకృష్ణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ తీరు మార్చుకోవాలి'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ముస్లిం ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతున్న తీరు మానుకోవాలని సలావుద్దీన్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు తగదని, ఇందుకు నిరసనగా సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (కడప) ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిరసన ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన నరేంద్రమోదీ ప్రభుత్వం పదకొండు సంవత్సరాలుగా వివిధ పద్దతుల ద్వారా ముస్లింలను అణచివేసే ధోరణి అవలంభిస్తున్నదన్నారు.కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాలొన్నారు.

మెడిసిన్, నర్సింగ్ విద్యార్థులకు బాసట సాయం

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాసట స్వచ్ఛంద సేవా సంస్థ కడప నగరానికి చెందిన మెడిసిన్, నర్సింగ్ విద్యార్థులకు రూ.50వేలు ఆర్థిసాయం చెక్కుల రూపంలో బుధవారం అందించారు. రేణిగుంట సమీపంలోని బాలాజీ మెడికల్ కళాశాలలో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న లోకేష్‌కి సెమిస్టర్ ఫీజుల నిమిత్తంరూ.30వేలు, కడప విజయదుర్గ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న సౌభాగ్యకి రూ.20వేలు అవసరం ఉందని, ఇందులో దాతల నుంచి రూ.10232 విరాళాలు రాగా మిగతా రూ.39,768 బాసట కీలక సభ్యులైన కార్తీక్‌రెడ్డి, ధరణి అందజేశారు.



7న సామూహిక నిరాహార దీక్షలు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రెండు సెంట్ల ఇళ్ల స్థలం, పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఈనెల 7వ తేదీన సామూహిక నిరాహార దీక్షలు చేపట్టినట్లు సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ పేర్కొన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ

వల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో పరిశుభ్రత కోసం గ్రీన్ అంబాసిడర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిందని ఎంపీడీవో రఘురాం అన్నారు. బుధవారం వల్లూరులో ఎస్‌డబ్ల్యుపీసీ సెంటరులో మండల పరిధిలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు ఒక్కరోజు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ఆర్‌పీ దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం..: ప్రతి గ్రామ పంచాయతీలో పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవడం అందరి బాధ్యత అని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణపై సర్పంచులు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు ఎంపీడీఓ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ వెంకటరాముడు, ఏపీఓ జయభారతి, సర్పంచులు, కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఫైవ్‌స్టార్ రేటింగ్
ఎలక్ట్రానిక్ వస్తువులను వాడాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఫైవ్ స్టార్ రేటింగ్ గల ఎలక్ట్రానిక్ వస్తువుల ద్వారా విద్యుత్ ఆదా చేయవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షర్మిల రాణి తెలిపారు. బుధవారం కడపలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీకన్జర్వేషన్ మిషన్, కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఎనర్జీ క్లబ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు.

విలీన తరగతులను కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తారకరామ నగర్‌లోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలను కొనసాగిస్తూ 3,4,5 తరగతులను చేర్చాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్, జగదీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో తారకరామ నగర్ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి డీఈవో షంషుద్దీన్‌కు వినతిపత్రం అందించారు.

బీఎస్ఎన్ఎల్ టవర్‌ను ఏర్పాటుచేయాలి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాశినాయన మండలంలో వెలసిన కాశిరెడ్డి నాయన క్షేత్రంలో బీఎస్ఎన్ఎల్ టవర్ సౌకర్యం కల్పించాలని భారతీయ జనతాయువ మోర్చా (బీజేవైఎం) జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కడపకు విచ్చేసిన మంత్రి సత్యకుమార్‌ను స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోసుల శ్రీనివాసులురెడ్డి, నాగిరెడ్డి, ఓబయ్య, రమణ, సుబ్బయ్య తదితరులున్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ నిర్వహించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని పరీక్షల తేది ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపడతామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలని కోరుతూ నిరుద్యోగులతో కలిసి మహవీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన



కడప నాగరాజుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌పగడాల మృతికి సంతాపంగా బుధవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని కాంగ్రికేషనల్ టౌన్ చర్చి ఆవరణంలో సంఘ పాస్టర్ రెవరెండ్ ఎస్.మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రవీణ్‌పగడాల కడప వాసుడు కావడం మనకెంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ విజయుడు, ట్రెజరర్ నోవా బెన్నీ, డీకన్ కమిటీ పెద్దలు ఆశీర్వాదమ్మ, సుశీలమ్మ,రామనోహర్, ప్రసన్నకుమార్, పులి సునీల్‌కుమార్, తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.

పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పదు

సింహాద్రిపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని వక్తలు సన్మాన సభలో ప్రసంగించారు. సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న పద్మనాభరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారం సింహాద్రిపురంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, కార్యాలయ ఏఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ ఈఓ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాహం తీర్చడానికి నీటి తొట్లు

సీకేదిన్నె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పశువుల దాహం తీర్చడానికి నీటి తొట్లు కట్టించడం జరుగుతోందని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. మండలం లోని తాడిగొట్ల పంచాయతీలో బుధవారం ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల నీటితొట్టి నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, స్థానిక నాయకులు ఓబుళరెడ్డి, ఏపీవో రామాంజులరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బాపాఠశాలలోనే బాలికల సంరక్షణ

వల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాలికల కోసం చదువు కోసం ఉన్నతి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల అని ఎంఈవో -2 విజయారెడ్డి, జీసీడీవో అనిత అన్నారు. బుధవారం బాలికల కోసం ప్రత్యేక డ్రైవ్ మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలికలను ఆన్‌లైన్ ద్వారా ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.

వేధింపుల నుంచి ఉద్యోగులకు విముక్తి కల్పించండి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మనుగడకు కారకులైన కింది స్థాయి ఉద్యోగులైన కండక్టర్లు, డ్రైవర్లను పై స్థాయి అధికారుల వేధింపుల బారి నుంచి ఉపశమనం కలిగించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో ప్రతినిధులు సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. ఇందుకు నిరసనగా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాపితంగా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఎర్రబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కడప డిపో ఎన్ఎంయూ అధ్యక్షుడు తొండలదిన్నె జయరాం,కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, వైస్ ప్రసిడెంట్ పి.ఎస్.ఖాన్, కోశాధికారి టి.ఎం.బాషా, పాల్గొన్నారు.

దళితుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

కడప(వినాయకనగర్), ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలం కేఎన్ కొట్టాల గ్రామానికి చెందిన చాగలమర్రి చిన్నయ్య అనే దళితునిపై దాడి చేసిన కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన వెంకటరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేశ్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు రఘు, కాశినాయన మండల సీపీయం కార్యదర్శి పోలయ్య డిమాండ్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు చిన్నయ్యను బుధవారం వారు పరామర్శించారు. మద్యం మత్తులో వెంకటరెడ్డి గొడ్డలితో దాడి చేయడం వలన ఎడమ చేయి విరగడంతో పాటు పక్కటెముకలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే వెంకటరెడ్డిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు.





మైదుకూరు అర్బన్ సీఐగా శ్రీహరి



మైదుకూరు రూరల్ ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు అర్బన్ సీఐగా బుధవారం శ్రీహరి బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ సీఐగా పనిచేసి హసం బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీహరి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులోని ఆర్‌టీసీ బస్ డిపోలో ఎన్‌ఎంయూఏ నాయకులు బుధవారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏపీఎస్‌ఆర్‌టీసీలోని ఎన్‌ఎంయూఏ పలు డిమాండ్లపై పోరాడుతూనే ఉందని పోరాటంలో భాగంగా మైదుకూరు డిపో లోని తొలి సర్వీస్ నుంచి కార్మికులందరు ఎర్రబ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు.

13 గ్రామాలకు నీటి తొట్లు మంజూరు

దువ్వూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని 13 గ్రామాలకు నీటి తొట్లు మంజూరైనట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. వేసవి నేపథ్యంలో పశువులకు తాగునీటి సౌకర్యం ఏర్పరిచేందుకు ఈ తొట్లు ఉపయోగించనున్నట్లు చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఆరోగ్యం - పోషణపై శిక్షణ

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగు కార్యాలయంలో సభల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఆరోగ్యం పోషణపై శిక్షణ ఇచ్చారు. సభల్ ప్రాజెక్టు క్లస్టరు కోఆర్డినేటరు మహేశ్ మాట్లాడుతూ రైతుల జీవనోపాదుల పెరుగుదల దిశగా ఈ శిక్షణ సహకరిస్తుందన్నారు. హెల్త్ అండ్ న్యూట్రిషన్ రీసోర్స్ పర్సన్ భాస్కర్ డీఆర్‌డీఏ డీపీయం ధనుంజయ, వెలుగు ఏపీయం శివప్రసాద్, వెలుగు సీసీలు బాలయ్య, భాస్కర్, నారాయణరావు, గ్రామ సంఘం అసిస్టెంట్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కు ఏఎస్‌ఐగా పదోన్నతి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఖాదరయ్య

కాశినాయ ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) కాశినాయన మండలంలోని నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఖాదరయ్యకు ప్రభుత్వం ఏఎస్‌ఐగా పదోన్నతి కల్పించింది. ఆమేరకు ఏఎస్‌ఐగా పదోన్నతి పొందిన ఖాదరయ్య బుధవారం ప్రస్తుతానికి తాను పనిచేస్తున్న నర్సాపురం పోలీస్ స్టేషన్ లోనే ఏఎస్‌గా బాధ్య తలు స్వీకరించారు. ఏఎస్‌ఐగా పదోన్నతి పొందిన ఖాదరయ్యను సహచర ఉద్యోగులు, బంధువులు, మిత్రులు అభినందించారు.

మినీ మార్కెట్‌యార్డు అంతేనా..?

పోరుమామిళ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మినీ మార్కెడ్‌యార్డు భవనం పూర్తికాదు.. రైతుల కష్టాలు తీరవు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల రైతాంగానికి వారు పండించిన పంటలకు ధరలు వచ్చేంతవరకు నిల్వ ఉంచుకునేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పుల్లీడు సమీపంలో మినీ మార్కెట్‌యార్డుగోడౌన్‌కు స్థలం కేటాయించి నిధులు మంజూరు చేసింది. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో వైసీపీ హయాంలో దాదాపు రూ.3కోట్లు టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టినా మూడేళ్లవుతున్నా పూర్తికాక కంపచెట్లు నడుమ నిరుపయోగంగా అర్థాంతరంగా ఆగిపోయింది. గత పాలకులు సకాలంలో బిల్లులు చేయకపోవడం వల్లే సమస్య వచ్చిందని రైతులు వాపోతున్నారు. పోరుమామిళ్ల మండలంలోని పుల్లీడు సమీపంలో ఐదు ఎకరాల స్థలంలో మినీ మార్కెట్ యార్డు గోడౌన్‌ల నిర్మాణం ఒక్కోటి రూ.కోటి40లక్షలతో శ్రీకారంచుట్టారు. ఈ గోడౌన్ పూర్తయితే ఒక్కో గోడౌన్‌లో రెండువేల టన్నులు రైతులు పండించిన ధాన్యం కానీ పంటలు కానీ నిల్వ ఉంచుకునేందుకు వీలు ఉంటుంది. అంతేకాక వీటి నిర్వహణకు ఆఫీసు రూం, చుట్టూ ప్రహరీ నిర్మాణానికి కూడా నిధులు కేటాయించారు. కానీ అది దాదాపు 50 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా రెండు గోడౌన్లకు సంబంధించి కాంక్రీటు వేసి గోడౌన్లపై రేకులు ఏర్పాటు చేసి పరికరాలు అమర్చాల్సి ఉంది. కానీ బిల్లులు రాకపోవడం, ప్రభుత్వాలు మారడంతో పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అనేలా ఉంది.. ఈ మార్కెట్ గోడౌను పూర్తయితే పోరుమామిళ్ల ప్రాంత రైతులు 35 కిలోమీటర్లు బద్వేలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదు. అంతేకాక ఈ ప్రాంతంలో ఎక్కువగా క్రాసింగ్‌పంటలు కూడా సాగు చేస్తారు. వరికి పసుపు, పండుమిర్చికి మద్దతు ధర లభించేంత వరకు నిల్వ ఉంచుకునేందుకు అవకాశం ఉండేది. కానీ ఈ గోడౌన్ల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి మినీ మార్కెట్‌యార్డును పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.



పుల్లీడు సమీపంలో అసంపూర్తిగా ఉన్న మినీ మార్కెట్‌యార్డు

రూ.50 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది

మినీ మార్కెట్‌యార్డు గోడౌన్ నిర్మాణానికి అప్పులు తెచ్చి పనులు చేపట్టాం. పది నెలల క్రితం చేసిన పనులకు మార్చి 31న రూ.12లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇంకా రూ.50 లక్షల వరకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిర్మాణానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి అధికారులు స్పందించి చేసిన పనులకు బిల్లులు చెల్లించాలి.

- ధనిశెట్టి ఓబయ్య, కాంట్రాక్టర్, పోరుమామిళ్ల

పనులు చేపడితే బిల్లులు మంజూరు చేస్తాం

మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు చేపడితే నిధులు మంజూరవుతాయని ఏఈ మేఘనాధ్ తెలిపారు. ఈ విషయమై ఏఈని వివరణ కోరగా మినీ మార్కెట్‌యార్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ముగ్గురు కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. ఇప్పుడు పనులు చేపడితే బిల్లులు త్వరగా వస్తాయన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఏపీ సెక్రటరీ



గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న సెక్రటరీ ప్రసన్నవెంకటేశ్

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్ బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లె గురుకులాన్ని బుధవారం సందర్శించారు. రూ.20 కోట్ల నిధులతో గురుకుల నిర్మాణం చేపట్టి పనులు పూర్తి కాకపోయినా గత వైసీపీ ప్రభుత్వంలో హడావుడిగా పాఠశాలను ప్రారంభించింది. అయితే పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రభుత్వానికి సమస్యను అర్జీ ద్వారా విన్నివించారు. దీంతో బుధవారం సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్ గురుకుల పాఠశాలను సందర్శించి మౌలిక వసతులను గుర్తించారు. త్వరలోనే చేయిస్తామని సిబ్బందికి ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. అనంతరం ప్రస్తుతం ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లలకు ఉన్నటువంటి మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీవో ఉదయశ్రీ, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తా

● మండల సమావేశంలో జడ్పీ ఛైర్మన్ ముత్యాల రామగోవిందురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ రామగోవిందురెడ్డి

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలానికి జిల్లాపరిషత్‌లో ఉన్న నిధులను అధిక శాతం కేటాయించి అభివృద్ధి పరుస్తామని జిల్లా పరిషత్ ఛైర్మన్ ముత్యాల రామగోవిందురెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ అధ్యక్షుడు వీరనారాయణరెడ్డి అధ్యక్షతన బ్రహ్మంగారిమఠం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధికి అధిక నిధులను కేటాయించి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలోని మండలాలను కరువు మండలాలుగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అసెంబ్లీలో చర్చ పెట్టి కేటాయించడం హర్షణీయమన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేశ్, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంఈవో పుల్లయ్య, ఏపీవో హరిక్రిష్ణ, టీజీపీ ఏఈ నాగేశ్వర్‌రావు, వెలుగు ఏపీయం శివప్రసాద్, దేవస్థానం మేనేజరు ఈశ్వరయ్యాచారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిని దర్శించుకున్న జడ్పీ ఛైర్మన్

కాలజ్ఞాన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని జిల్లా పరిషత్ ఛైర్మన్ ముత్యాల రామగోవిందురెడ్డి బుధవారందర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది ప్రత్యేక మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని తొట్టిగారిపల్లె సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని కొత్త చెరువు గ్రామానికి చెందిన చిన్న, చరణ్, రామేశ్వరరావు అనే వారికి గాయాలయ్యాయి. వారు ముగ్గురు హైవేరోడ్డు పనుల్లో కూలీలుగా పనిచేసుకుంటూ తిరిగి ఇంటికివెళ్లే సమయంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొనడంతో వారికి గాయాలయ్యాయి. వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

ఆలయ హుండీచోరీకి యత్నం

ముద్దనూరు ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి):మండల పరిధి కొర్రపాడు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం హుండీలోని డబ్బులు దొంగలిస్తూ పూజారికి ఓబాలుడు చిక్కాడు. దాంతో పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి చోరీకి యత్నించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే చెన్నకేశవ స్వామి ఆలయ పూజారి మధ్యాహ్నం 2గంటలకు భోజనానికి వెళుతూ ఆలయానికి తాళం వేసి వెళ్లాడు. తరువాత ఆలయానికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా ఓ బాలుడు ఆలయంలోని హుండీ పగలగొట్టి డబ్బులు కవర్‌లో వేసుకుంటూ కన్పించాడు. దీంతో బాలుడుని పట్టుకొన్నారు. గ్రామ ప్రజలు ఆలయం వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంలోని సీసీ పుటేజీ ని పరిశీలించగా పట్టుబడిన బాలుడుతో మరొక బాలుడు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బాధిత కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుంది

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల పంచాయతీ టి.రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగిపోగు హృదయరాజ్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం గొర్రెలు మేపుకుంటూ నీటి కోసం బావి లోకి దిగడంతో అక్కడ ప్రమాదవశాత్తు హృదయరాజ్ మరణించాడు. విషయం తెలుసుకున్న బ్రహ్మంగారిమఠం టీడీపీ మండల నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలోకుటుంబాన్ని ఆదుకుంటామని టీడీపీ నేత మల్లిఖార్జునరెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెరుగు నాగేంద్ర, పుట్టాల శివ, రాజు, సుధాకర్ పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాశినాయన ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): నర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు 4వతేదీన శుక్రవారం ఉదయం 9గం నుంచి సాయంత్రం 6గం వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ రవీంద్రనాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని 33/11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం .ఆరోజు వ్యవసాయ కరెంట్‌ను ఉదయం 4గం నుంచి 9గంటల వరకు ఇస్తామని మిగిలిన కరెంట్‌ను రాత్రి 9గంటల తర్వాత ఇస్తామన్నారు.ఈవిషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన పీవో

ఖాజీపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలోగల కేజీబీవీని సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి నిత్యానందం ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం ఖాజీపేట బాలికోన్నత పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్కూలులో అడ్మిషన్లు అధికంగా వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి నాగస్వలర్లత, హెచ్‌ఎం సుజాతమ్మ, కస్తూరిబాగాంధీ ప్రిన్సిపాల్ భార్గవి పాల్గొన్నారు.


మౌలిక వసతుల కల్పనతోనే గ్రామీణులకు పండుగ



హెల్త్‌క్లినిక్‌లో బీపీ చెక్‌చేయించుకుంటున్న మంత్రి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన జరిగినప్పుడే అసలైన పండుగ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. కొత్తపల్లె పంచాయతీలోని కానపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన భవన సముదాయాలను బుధవారం ప్రజాప్రతినిధులు, నాయకులు అట్టహాసంగా ప్రారంభించారు. విలేజ్ క్లీనిక్‌ను రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రారంభించగా భవన సముదాయ నిర్మాణాలను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కానపల్లెలోని కె-3 సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో ఏర్పాటు చేసిన వసతులను మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి సత్యకుమార్‌కు పీహెచ్‌సీ వైద్యాధికారి మహాలక్ష్మి బీపీని చెక్‌చేశారు. తదనంతరం రైతు సేవా కేంద్రాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ ప్రాంగణంలో మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు గంగయ్య, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యురాలు మహాలక్ష్మి, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్చడంలో మంత్రి సత్యకుమార్ కృషి




మంత్రి సత్యకుమార్‌కు శ్రీరామ చరిత పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కడపజిల్లా పేరును మార్చడంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎంతగానో కృషి చేశారని జిల్లా అభివృద్ధి వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరుకు వచ్చిన మంత్రిని వారు కలిసి జిల్లా పేరు మార్చడానికి కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాకు 200 ఏళ్ల చరిత్ర ఉందని గత ప్రభుత్వం ప్రజల మనోభావాలనుపట్టించుకోకుండా ఏకపక్షంగా జిల్లా పేరును మార్చిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అభీష్టాన్ని కడపజిల్లా పేరును పునరుద్ధరించాలని మంత్రిని కోరగా మంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి జిల్లా పేరు మార్చడానికి కృషి చేశారన్నారు. ఈసందర్భంగా మంత్రికి శ్రీరామ చరిత పుస్తకాన్ని వారు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పద్మజ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రధాని మోదీ కృషితోనే ఎస్సీ వర్గీకరణ సాకారం

ప్రొద్దుటూరు టౌన్/అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి):ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ కల సాకారమైందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఏపీఎమ్మార్పీఎస్ వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ సభ్యుడు గురజాల రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు దశాబ్దాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని మందక్రిష్ణమాదిగ మొక్కవోని దీక్షతో వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ప్రొద్దుటూరులో మాదిగ సోదరులు తనను ఆత్మీయ సమావేశంలో సత్కరించడం మరచిపోలేనని తెలిపారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఏపీఎమ్మార్పీఎస్ నాయకులు గడ్డం నరసింహ, శివ, కత్తి ఓబులేసు, యల్లయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ యాదవ్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు విచ్చేసిన ఆయనకు ప్రజాసేవ సమితి అధ్యక్షుడు అయూబ్ ఖాన్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యం కల్పించడానికి అనుమతి కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. 2003 డీఎస్సీ వారికి పాత పింఛన్ అమలు చేయాలని ఉపాధ్యాయులు, పలు ప్రజా సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. వినతులు స్వీకరించిన ఆయన సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకొని పోతానని తెలిపారు.

బదిలీపై వెళుతున్న ఎస్సై విద్యాసాగర్‌కు సన్మానం



కొండాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొండాపు రం నుంచి కమలాపురానికి బదిలీపై వెళ్లనున్న ఎస్సై విద్యాసాగర్ ను బుధవారం పలువురు పూలమాలతో శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. గత తొమ్మిది నెలలుగా కొండాపురం పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రత ల నిర్వహణలో ఎస్సై విద్యాసాగర్ తనవంతు కృషిచేశారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, సుబ్బారావు పాల్గొన్నారు.

7న తిరుపతిలో జరిగే ధర్నా జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్పీడీసీఎల్‌వద్ద ఈ నెల 7న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిక్ కాంట్రాక్టు యూనియన్ వర్కర్స్ నేతలు పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని విద్యుత్ కార్యాలయం ఎదుట కరపత్రాలు ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్, డివిజను కార్యదర్శి కొండయ్య, నాయకులు నౌసాద్ నబీ, గిరి బ్రహ్మంపాల్గొన్నారు.

పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలి

బద్వేలు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ కోరారు. బుధవారం భాకరాపేట సమీపంలో సీపీఐ కాలనీలో నివశిస్తున్న నిరుపేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని స్థానిక తహసీల్దారు ఉదయభాస్కర్ రాజుకు దరఖాస్తులు అందించారు. సీపీఐ రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్, వెంకటరమణ, గోపవరం కార్యదర్శి పెంచలయ్య, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు రాక రోగుల ఇక్కట్లు



ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో వైద్యుల కోసం వేచి ఉన్న రోగులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు సకాలంలో రాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్లు విధులకు ఇష్టం వచ్చినప్పుడు వస్తున్నారని మరికొందరు దుమ్మా కొడుతున్నారని ఆరోపణలున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారని పలువురు వాపోతున్నారు. కాగా బుధవారం ఉదయం 9 గంటలకు డాక్టర్లు విధులకు హాజరుకావాల్సి ఉండగా కొందరు ఉదయం 10 గంటలకుపైగా రాగా మరి కొందరు 11 గంటల మధ్య సమయంలో హాజరయ్యారని రోగులు ఆరోపిస్తున్నారు. మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాతోపాటు కొందరు డాక్టర్లు విదులకు ఉదయం 9 గంటలకే వస్తుండడం వలన కొంత ఇబ్బందులు లేకుండా రోగులకు వైద్య పరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ల కోసం రోగులు పడిగాపులు కాసి ఉన్నట్లుండి ఉదయం 10.30 గంటలకు ఇద్దరు డాక్టర్లు రాకతో ఒక్కసారిగా క్యూ కట్టారు. మరికొందరు ఇతర డాక్టర్లకోసం పడిగాపులు కాశారు. కాగా ఈ సమస్యపై సంబంధించి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాను 'ఆంధ్రజ్యోతి' రోగుల సమస్యలు తెలిపి వివరణ కోరగా బుధవారం ఉదయం నుంచి 11 గంటల వరకు ఇద్దరు డాక్టర్లు మాత్రమే పనిచేశారన్నారు. మరో ముగ్గురు సదరం క్యాంపునకు వెళ్లారని, మరికొందరు సెలవులో ఉన్నారన్నారు. డాక్టర్లు లేక రోగులు ఇబ్బంది పడ్డారని ఆయన తెలిపారు.

రంగసాయిపురంలో నవమి మెరవణి సమస్య



రంగసాయిపురంలో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని రంగసాయి పురంలో శ్రీరామనవమి పండుగ మెరవణి సమస్య చిలికిచిలికి గాలివానలా మారుతోంది. గ్రామంలో ప్రతి శ్రీరామ నవమి పండుగకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తారు. అయితే గ్రామ పొలిమేరల్లో ఉన్న ఓ వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లడంలేదు. ఈసారి మాత్రం వారి ఇంటి వద్దకు కూడా మెరవణి వెళ్లాలని తహసీల్దార్ శోభన్‌బాబు, సీఐ నరేష్‌బాబులతో కూడిన అధికారుల బృందం గ్రామంలో బుధవారం సమావేశమై చర్చించారు. ఇందుకు ప్రజలు అంగీకరించలేదు. పాత సాంప్రదాయాన్ని కొనసాగిస్తామని పార్టీలకు అతీతంగా ప్రజలు తెగేసి చెప్పారు. అవసరమైతే పండుగనే జరుపుకోమని, పొలిమేర అవతల ఉన్న వారి ఇంటివద్దకు మెరవణి వెళ్లదన్నారు. ఈవిషయంపై గ్రామస్థులు కొందరు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామంలో శ్రీరామనవమి పండుగ జరుపుకుంటున్నామని, అయితే కొందరు పనికట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆగ్రహించారు. సున్నితమైన విషయాన్ని పెద్దది చేయడం సరికాదని, గ్రామాల్లో చిచ్చు పెట్టవద్దని వారు పేర్కొన్నారు. ఈవిషయంపై తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి వినతులు



వినతి పత్రాలను పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో పలు సమస్యలపై బుధవారం ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, సామాన్యులు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. వివిధ సమస్యలపై భూపేశ్‌రెడ్డితో మాట్లాడి త్వరలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికకు నియోజకవర్గంలోని గ్రామాల నుంచి భూములు, స్థలాల ఆక్రమణలు తదితర సమస్యలపై వినతి పత్రాలు అందించారని ఆ దిశగా అధికారులకు సమస్యలను తెలిపి బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా అధికారులతో మాట్లాడి వెంటనే స్పందిస్తున్నామని ఆయన విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 50 దరఖాస్తులు అందించినట్లుగా తెలిపారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన కామాంధ ఉపాధ్యాయుడు అన్వర్‌పై తగు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కే.ఆదిల్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు అయి ఉండి ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడడం బాధాకరమని ఇందుకు కారణమైన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేయాలని లేకుంటే ఆందోళన చేపడతామన్నారు. డీవైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి యువరాజు, ఉపాధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులో నివాసం ఉంటున్న రాధ అనే మహిళ మిద్దెపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స కోసం వెంటనే ఆమె తల్లి రాధను రిమ్స్‌కు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పినట్లు స్థానికుల సమాచారం.